క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల : స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని కొత్ర పాటిపల్లె, కోడిగుడ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీదేవి కోరారు. కొత్ర పాటిపల్లెకు బీసీ–సీ కేటగిరి మహిళ దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల11లోగా పూర్తి చేసిన దరఖాస్తు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు.

యువత రక్తదానం చేయాలి

మైదుకూరు : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డితో పాటు పలువురు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, క్లబ్ కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కీర్తనలు, హారతులు

పోరుమామిళ్ల : ధనుర్మాసం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో మహిళలు గోదాదేవి పాశురాలు, కీర్తనలు ఆలపించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు పాశురాలు ఆలపించగా, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సామూహిక హారతులు ఇచ్చారు.

మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ

ప్రొద్దుటూరు : నెహ్రూ యువకేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు 15 నుంచి 29 ఏళ్లలోపు ఉండాలని ఆమె పేర్కొన్నారు. పట్టణంలోని సూపర్ బజార్ రోడ్డులో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, శిక్షణ 45 రోజులు ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9154195061లో సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం సగర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. చెన్నమరాజుపల్లె శీను, సీతంపల్లె రవి, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు వీరమోహన్, ఉప్పర మురళి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

రాజుపాళెం : రాచమల్లు రాఘవేంద్ర విష్ణువర్ధన్ రెడ్డి జన్మన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు అన్నదాన ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడ ఉన్న వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. బలరామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విజయమునిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

గోపవరం: జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో ఎప్పటికప్పుడు పురోగతి కనిపించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని రాచాయపేట, బ్రాహ్మణపల్లె, ఎస్.రామాపురం జగనన్నకాలనీలను ఆయన పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను కోరారు. అలాగే సొంతంగా నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణపల్లె, సంద్రపల్లె సచివాలయాల్లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ హరినారాయణ, ఏపీఓ జయచంద్ర, ఏపీఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మండలంలోని ఎస్.రామాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం పరిశీలించారు. పిల్లల హాజరు రెండు, మూడు రోజులకొకసారి వేస్తున్నందున హెచ్చరించారు.

సచివాలయాలతోనే మెరుగైన సేవలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



సుందరయ్య కాలనీలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధ

రాజుపాళెం : సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ఆయా గ్రామస్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని కొత్రపాడులో వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.79లక్షలు నిధులు మంజూరు చేశామని, ఆ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు, జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, సీడీపీఓ రాజేశ్వరి పాల్గొన్నారు. సర్పంచ్ పి.ఓబుళమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజారాంరెడ్డి, గౌతమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ జ్ఞానానందం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకు వందరోజులు పూర్తి

బద్వేలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నియోజకవర్గంలో వంద రోజులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం సచివాలయం–1లో సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలోని సుందరయ్య కాలనీ, గిరినగర్–1 ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యేందుకు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాలప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం జరగదు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



లబ్ధిదారులకు పింఛన్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

బద్వేలు అర్బన్ : పింఛన్ల విషయంలో అర్హత ఉన్న ఏ ఒక్కరికి అన్యాయం జరగదని, పింఛన్లు తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. పింఛన్ పంపిణీ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తుండేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. అనంతరం పెంచిన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు స్థానిక గుంతపల్లె సమీపంలోని జగనన్నకాలనీ వద్ద రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో పూడికతీత పనుల కోసం రూ.30.09 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన జేసీబీని వారు ప్రారంభించారు.మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం నరసాపురంలోని మండల పరిషత్ సభా భవనంలో పింఛన్ వారోత్సవాల్లో ఆమె పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

రాజుపాళెం : పింఛన్లను పెంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్ఏ నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభాభవనంలో శనివారం కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు బీరం నారాయణమ్మ, ముక్కమల్ల లక్ష్మీదేవి, మహబూబ్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు పాతపాటి శివనాగిరెడ్డి, నాయకులు రాజారాంరెడ్డి, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయండి

బద్వేలు అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అభ్యర్థితో కలిసి ప్రచార గోడపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి పాల్గొన్నారు.

వెండి కిరీటాలు బహూకరణ

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి ప్రొద్దుటూరుకు చెందిన నల్లపోతులగౌతమ్‌నాయుడు వెండి కిరీటాలు, పాదుకలు, హస్తాలు బహూకరించారు. అలాగే ముమ్మడిరెడ్డి నాగేంద్రరెడ్డి, విజయశాంతి దంపతులు స్వామి వారికి వెండి షటారు బహూకరించారు. శనివారం తెల్లవారుజాము నుండే స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జీఓ 1ని రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక హక్కుల కోసం ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు చేపట్టే ర్యాలీలు, సభలు, ధర్నాలను నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ 1ని తెచ్చిందన్నారు. వెంటనే ఈ జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, వీఎస్ ముక్తియార్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నజీర్ అహమద్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని పుల్లీడు పంచాయతీ పరిధి చెన్నారెడ్డిపేటలో 3.7 కిలోమీటర్ల పరిధిలో రూ.3.40 కోట్ల వ్యయంతో చెన్నారెడ్డిపేట నుంచి పుల్లీడుకు తారు రోడ్డు నిర్మాణానికి శనివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కాక సంక్షేమంతో పేదల బతుకుల్లో వెలుగులు నింపేందుకు తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఇప్పటికే పోరుమామిళ్ల మండలంలో రూ.50 కోట్లకు పైగా వ్యయంతో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు సీ బాషా, చెన్ను రాజశేఖర్, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులతో ఏజీఎం, ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో విజయభేరి మోగించారు. పాఠశాల విద్యార్థుల్లో ఎంటీఎస్ఓకు 80 మంది, ఎస్టీఎస్ఓకు 65, ఈటీఎస్ఓకు 48, జీటీఎస్ఓకు 45, ఏటీఎస్ఓకు 62 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శనివారం పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం నాగిరెడ్డి , కో ఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఒంటేరు

దువ్వూరు : అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజీలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలలో ఖాళీల భర్తీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఎయిడెడ్ కళాశాల, పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపక, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల కోసం, 2004 తర్వాత ఉపాధ్యాయ, అధ్యాపకులుగా నియమితులైన వారికి పెన్షన్ వర్తించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి కేశవరెడ్డి, ఆర్జేయూపీ నాయకుడు రవికుమార్, అధ్యాపకులు శ్రీలత, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన లయోల పాలిటెక్నిక్ కళాశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని రాయలసీమ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం రాత్రి 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను పులివెందుల లయోల పాలిటెక్నిక్ కళాశాల గెలుపొందింది. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. సీబీఐటీ డిప్లమో కళాశాల ఇన్‌చార్జి రమేష్, ఆర్గనైజర్ మంజునాథ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి పీడీ థామస్, వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి

చాపాడు : స్థానిక చైతన్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం పాలిటెక్నిక్ డిప్లమో మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి విజయాలు సాధిస్తారన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రామేశ్వరం బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

- హాజరుకానున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : రామేశ్వరం పెన్నా నదిపై రూ.53 కోట్లతో నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన భూమి కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్టాండు, కూరగాయాల మార్కెట్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీకి సంబంధించి టెండర్ పూర్తయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో రూ. 1 కోటికి పైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు రామేశ్వరం బైపాస్–ఆర్టీపీపీ జంక్షన్ వద్ద భూమి పూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. బ్రిడ్జి వల్ల ఆర్టీపీపీకి ప్రయాణం దగ్గరగా మారడంతో పాటు సులభతరం అవుతుందన్నారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలు, వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రొద్దుటూరు: నియోజకవర్గ పరిధిలో నోటీసులు ఇచ్చిన వారందరికీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తిరిగి పింఛన్లను మంజూరు చేయించామని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. మున్సిపాలిటీలోని 22 వార్డు పరిధిలోని షేక్ చాసేన్ బాషా, షేక్ కరిమున్నీసా, షేక్ మాపీర్‌లకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పింఛన్లను అందించారు. వార్డు ఇన్‌చార్జి హిదాయత్, కరిముల్లా పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

చాపాడు : చాపాడు సమీపంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజి కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రాచీన సంప్రదాయాలు దూరమైపోతున్నాయని, వాటిని విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. సంప్రదాయ వస్త్రధారణ, వంటకాలు, రుచులు, రంగవల్లులు, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. తొక్కుడుబిల్ల, గాలిపటాలు, సాంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించారు.

12 నుంచి సంక్రాంతి సంబరాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో 12వ తేదీ నుంచి సంక్రాంతి సంబరాల పోటీలను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యువకులకు క్రికెట్ పోటీలు, మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ నెల 11లోపల ఆసక్తి గల వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు సురేష్, జేవీవీ నాయకుడు సురేంద్ర వివరించారు. మరిన్ని వివరాలకు 9502494474, 7671073221 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బస్టాండ్ అభివృద్ధికి కృషి

రాజుపాళెం : రాజుపాళెంలోని బస్టాండ్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం రాజుపాళెం బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మరుగుదొడ్లు, బస్సులు నిలబడే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొద్దుటూరు కార్గో పార్శిల్ ఇన్‌చార్జి వెంకటరమణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అర్బన్ ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుభాష్‌గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

వివేకానంద జయంతి వారోత్సవాలు

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల గ్రామంలో శనివారం స్వామివివేకానంద జయంతి వారోత్సవాలను వివేకానందుని వేషధారణలో గ్రామంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. కడప అంచల్ సమితి ప్రధాన కార్యదర్శి కె.చెన్నకృష్ణయ్య, అభియాన్ రామకృష్ణ, గతివిధి ప్రముఖ్ రమణయ్య పాల్గొన్నారు.

స్వామి వివేకానంద శోభాయాత్ర

పోరుమామిళ్ల : రామాయపల్లెలో శనివారం ఎంపీపీ పాఠశాల విద్యార్థులు హెడ్మాస్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు సంస్కారం అలవర్చుకోవాలన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎంపీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరారు.